# ఈ భూమిపై స్థాపింపబడు పరలోక రాజ్యము

స్టీఫెన్ హ్యాగ్స్

<u>విషయ సూచిక:</u>

1. ప్రస్తుత ప్రపంచము ........................................ 1
2. యేసు తిరిగి ఎప్పుడు వచ్చును? ........................... 5
3. రాజ్యము ఏరీతిగా వుండును? ............................. 12
4. యెరూషలేము ప్రపంచమునకు ప్రధాన పట్టణము .......... 15
5. ముగింపు ................................................... 26
6. ప్రశ్నలు ................................................... 28

ముద్రణ మరియు ప్రచురణ:
ప్రింట్ ల్యాండ్ పబ్లిషర్స్
జి. పి. ఒ. బాక్స్ - 159,
హైదరాబాదు - 500 001,
ఇండియా.

# ఈ భూమిపై స్థాపింపబడు - పరలోక రాజ్యము
# The Kingdom of Heaven - on Earth!

## ప్రస్తుత ప్రపంచము
**Today's World**

ఏ రకమైన యుద్ధభయాందోళనలు లేనటువంటి, మరియు ఆకలిచేత, వివిధములైన అనారోగ్యములచేత మరణిస్తున్నటువంటి పిల్లలు లేని, ఎంతో సంతోషకరమైన, ప్రపంచము ఒక్కసారి ఊహించండి. ప్రస్తుత సహజసిద్ధమైన స్థితిగతులను బట్టి ఆ రకమైన ప్రపంచమును చూడగలగటం అసాధ్యం. నిజమే, ఎందుకనగా ప్రపంచ శాంతి స్థాపనకు ఎన్నో ప్రణాళికలను రూపొందిస్తున్నప్పటికీ ఒకదాని తరువాత మరొకటి ఎన్నోరకములైన, వేదనలు, ఇబ్బందులు ఉద్భవిస్తూనేవున్నాయి. నేటి ప్రపంచము పూర్తిగా యుద్ధవాతావరణం చేత నిండుకొనివుంది. అంతేకాకుండా నరహత్యలు, టెర్రరిజం, మానవాళి మనుగడకు సంబంధించి అల్లకల్లోలాలను సృష్టించే మత ద్వేషాలతోను పూర్తిగా నిండుకొనివుంది. అతి పెద్ద మొత్తంలో ప్రజలు బీదరికంతో జీవిస్తున్నప్పటికీ సమస్తదేశాలన్నీ కూడా యుద్ధాయుదాలను తయారుచేసుకోడానికి భారీమొత్తంలో ధనాన్ని వెచ్చిస్తూవున్నాయి.

బాగా అభివృద్ధి చెందిన దేశాల కంటే అర్థికంగా వెనుకబడిన దేశాలు, వాటి జాతీయ సంపదలో కొంత శాతాన్ని విద్య, ఆరోగ్యము, వసతి అనువాటికి కేటాయించవలసివుండగా, అధిక శాతం ధనాన్ని యుద్ధాయు దముల కొరకే వెచ్చిస్తూవున్నాయి.

అదేవిధంగా ఇతర సమస్యలు: రసాయనాలు మరియు అణ్వాయుదాలు, కాలుష్యం, ఓజోన్ పొర క్షీణించిపోవడం వివిధరకాలైన జంతుజాతులు, వృక్షాలు అంతరించిపోవడం, మరియు వాటి నివాసయోగ్యమైన భూములు కనిపించకుండా పోవడం.

అన్ని రకములైన సమాజములలో నైతిక స్థైర్యము దిగజారిపోవుట: నేరాలు,

మత్తు సంబంధమైన ఉత్ప్రేరకాలు, (లేక మాదకద్రవ్యాలు) ఎయిడ్స్.
ఇప్పటికీ పేదరికం ఆవరించివుండుట. ప్రపంచజనాభాలో సుమారు 70 శాతం ప్రజల చదవటం, వ్రాయటం తెలియని వారున్నారు. మిక్కిలి అధిక సంఖ్యలో, ఇప్పటికీ పాఠశాలకు వెళ్ళని పిల్లలున్నారు. కారణం, వారి తల్లి, తండ్రులకు పిల్లలను చదివించ తగిన ఆర్థికస్థోమత లేకపోవటమే ఎంతో మంది ప్రజలువైద్య సంబంధమైన జాగ్రత్తలు పాటించటం లేదు. ప్రపంచంలోని కొన్ని భాగాలలో ఇప్పటికీ వైద్యులు అనే వారు అసలే లేరు. వీటన్నిటికి అంతం ఎక్కడ? అనుకోని విధంగా ఈ ప్రపంచం ఎంతో ఉన్నతమైన స్థితిని పొందగలదా?

విచారించవలసిన విషయం, పొందలేదు. కారణం మనిషి వాస్తవమైన పరిస్థితులకు అదుపులో లేక నిర్దేశము కలిగి వున్నంతవరుకూ మెరుగైన ప్రపంచం రూపు దిద్దుకోవడం అసాధ్యం. అయితే ఇంకనూ ఎంతో మెరుగైన రోజు అతిత్వరలో వస్తుంది. అని బైబిలు బోధిస్తుంది.

## యేసు యొక్క రెండవ రాకడ

### The return of Jesus

సుమారు 2000 సంవత్సరాలకు పూర్వం, యెరూషలేము ప్రాకారపు గోడలకు అవతలనున్న ఒలీవకొండల మీద, యేసు క్రీస్తు యొక్క ఆరోహణమును ఆయన శిష్యులు తలలుపైకెత్తి ఆయన మేఘాలలో అదృశ్యమయ్యేంతవరకు చూడటం. ఆ తరువాత ఇద్దరు దేవదూతలు, ఆ శిష్యులకు ప్రత్యక్షమై ఒకానొకరోజు తిరిగి ఈ భూమి మీదికి యేసు అదే రీతిగా తిరిగి వస్తాడని చెప్పటం జరిగింది;

ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్ళుచుండగా, వారు ఆకాశమువైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారి యొద్ద నిలిచి - గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన ఈ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి. (అపో.కా.

1:9-11)

ఒక వేళ యేసు యొక్క రెండవ రాకడను గూర్చి తెలిపే వాక్యాలలో, పైన పేర్కొనినది ఎంతో ప్రాచుర్యం గలది అయినప్పటికీ, సుమారు వంద (100) వచనాలకు పైగానే ఆయన రాకడను గూర్చిన వచనాలు బైబిలు నందున్నవి.

యేసు పరలోకమునకు ఆరోహణము కాకముందు ఆయన శిష్యులు ఆయనను ఒక ప్రశ్న అడిగారు.

కాబట్టి వారు కూడి వచ్చినప్పుడు - ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా? (అపో. కా. 1:6)

ఇక్కడ మనం చారిత్రకమైన కాలములగురించి కొంత అర్థంచేసుకోవలసిన అవసరం వుంది. శిష్యులు అడిగిన ప్రశ్నకూడా ఎంతో అభినందించదగినది. వారు తిరిగి "రాజ్యమును - స్థాపిస్తావా" అని అడిగారు - అనగా వారికి రాజ్యము లేని ఆ కాలంలో, దావీదు, సొలోమోనుల రాజ్యం గురించి గుర్తుచేస్తున్నట్లుగా గమనించగలం.

ఆ కాలంలో, అనగా సుమారు 30-33 సంవత్సరాల (క్రీస్తు తరువాత) కాలంలో ఇశ్రాయేలు రోమా సామ్రాజ్యంలో ఒక భాగమైయుండేది. కనుక అది రోమా పరిపాలనలో ఉండేది. కావున శిష్యులు, యేసు రోమా పరిపాలన నుంచి ఇశ్రాయేలుకు విముక్తిని కలుగజేస్తాడని ఆశించినట్లుగా గమనించగలం.

యేసు తన శిష్యులకు ఇచ్చిన సమాధానం ఈ విధంగా వుంది:

కాలములను, సమయములను తండ్రి తన స్వాధీనంలో ఉంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పని కాదు. (అపో.కా. 1:7)

దీనికి ముందు, సరిగ్గా ఆరు వారాల క్రితం ఒలీవల కొండమీద పై సమాధానాన్నే శిష్యులకు చెప్పియున్నాడు:

ఆ దినమును గూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందు దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. (మార్కు 13:32)

అంతేకాకుండా, యేసు పరలోకమునకు ఆరోహణమై వెళ్తున్నప్పుడు తిగిరి ఆయన ఈ భూమి మీదికి ఎప్పుడు వస్తాడో అనే విషయం ఆయునకు కూడా తెలియదు. ఆయన తిరిగి ఎప్పుడు వస్తాడో ఖచ్చితమైన సమయం దేవునికి మాత్రమే తెలుసు.

అప్పుడు శిష్యులు ఇశ్రాయేలుకు తిరిగి రాజ్యమును ఎప్పుడు అనుగ్రహిస్తావు అని ఎందుకు అడిగారు? ఎందుకనగా భవిష్యత్‌లో ఏదైతే జరుగబోతుందో, దానినే ఆయన తన శిష్యులకు తెలియజెప్పాడు.

శిష్యులు యేసుతో పాటు ఇశ్రాయేలు దేశమంతటా సంచరిస్తున్నంత కాలం, వారు మునుపెన్నడూ లేని విధంగా ఒక మంచి బోధకుని కలిగివున్నారు. యేసు అతని మరణ, పునఃరుత్థానముల తరువాత కూడా ఆయన శిష్యులకు బోధించడం కొనసాగించాడు. యేసు పునఃరుత్థానుడైన అతి స్వల్పకాలములో, ఆయన ఇద్దరు శిష్యులు, యెరూషలేము నుంచి కొన్ని గంటల ప్రయాణ కాలము పట్టు ఎమ్మాయు అను చిన్న పట్టణమునకు వెళ్తున్న మార్గంలో, వారితో కలసి, వారికి పాతనిబంధన లేఖనములను గుర్తుచేశాడు.

మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్నుగూర్చిన వచనముల భావము వారికి తెలిపెను. (లూకా 24:27)

ఎమ్మాయు కు వెళ్ళు మార్గములో యేసుకు ఆయన శిష్యులకు మధ్యజరిగిన విషయం సంపూర్ణంగా (వ్రాయబడలేదు) మనకు తెలియదు కానీ, మనము పాత నిబంధన చదువునప్పుడెల్లా ఆయన మాటలను మన యొక్క మనస్సునందుచుకొనవలను:

యేసు తన శిష్యులతో, ఒకానొక రోజు ఇశ్రాయేలీయుల యొక్క పూర్వకాలమందున్న రాజ్యము అనగా "యెహోవా రాజ్య సింహాసనము" పునఃస్థాపింపబడుతుందని (1 దినవృ. 28:5) తెలియజేశాడు. ఆ రాజ్యము యేసుకు 600 సంవత్సరాల క్రితం ముగిసినది. అనగా యూదా చిట్ట చివరి రాజైన జెద్కియా, ఖచ్చితంగా యేసుకు పూర్వం 587 సంవత్సరాల క్రితం, బబులోను చేత పట్టబడినప్పుడు, ఆ రాజ్యము అంతమొందినది. ఆనాటినుంచి కూడా ఇశ్రాయేలు పూర్వకాలంలో ప్రపంచమును పరిపాలించిన గొప్ప సామ్రాజ్యములకే చెందివుండేది. మొట్టమొదట, బబులోను, రెండవదిగా పారసీకు, మూడవదిగా గ్రీకు, నాలగవదిగా - అనగా యేసు పుట్టుకకు కేవలం కొన్ని దశాబ్దాలముందు నుంచి పరిపాలించిన రోమా సామ్రాజ్యము.

ప్రవక్తయైన యెహెజ్కేలు ఆనాటి ఇశ్రాయేలు యొక్క రాజ్యము

అంతమొందుతుందని భవిష్యత్తును గూర్చి ప్రవచించాడు. ఎట్లైనను, ఆనాటి రాజ్యము పూర్తిగా అంతమొందదు కానీ, ఒక దృక్కోణమును బట్టి భవిష్యత్తులో ఒక ప్రత్యేకమైన రాజుచేత తిరిగి పునఃస్థాపింపబడుతుంది:

"గాయపడినవాడా, దుష్టుడా, ఇశ్రాయేలీయులకు అధిపతి (జెదెక్కియా), దోషసమాప్తికాలమున నీకు తీర్పు వచ్చియున్నది. ప్రభువైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నీ తలపాగాను తీసివేయబడును, మీ కిరీటమును ఎత్తబడును, ఇది ఇకను ఇట్లుండదు. ఇకమీదట నీచుడు ఘనులగుదురు ఘనులు నీచులగుదురు. నేను దానిని పడద్రోయుదును పడద్రోయుదును పడద్రోయుదును; దాని స్వాస్థ్యకర్త వచ్చుపర్యంతరము అదియు నిలువదు, అప్పుడు నేను దానిని అతనికిచ్చెదను". (యెహెజ్కేలు 21:25-27)

దాని "స్వాస్థ్యకర్త" అది యేసు క్రీస్తే.

## యేసు తిరిగి ఎప్పుడు వచ్చును?

**When is Jesus coming back?**

యేసు ఖచ్చితంగా తిరిగి వచ్చే సమయమును తెలుసుకొనుటకు మనం ఎంతో ప్రేమగలిగి వున్నాము. అయితే దేవుడు తన యొక్క అపారమైన జ్ఞానముచేత, ఆ సమయమును మనము తెలిసి కొనకుండుటయే మంచిదని నిర్ణయించివున్నాడు. ఏమైనప్పటికి యేసు ఆయన రెండవ రాకడకు ముందు జరిగే కొన్ని సంఘటనలను తెలియజెప్పడం ద్వారా, ఆ సమయమును గురించిన అవగాహన మనకు కలుగజేసియున్నాడు. బైబిలునందు త్వరలో జరుగబోవు ఆయన రాకడను గురించి ఎన్నో సూచనలు (కాలములయొక్క సూచనలు) వ్రాయబడియున్నవి. వాటిలో రెండింటిని చూద్దాం;

## మొదటిది, ఇశ్రాయేలుకు చెందిన సూచన

**Firstly, the sign of Israel**

ఆయన సిలువవేయబడక మునుపు రెండు రోజులకు ముందు, యేసు

తన శిష్యులతో పాటు ఒలీవల కొండకు వెళ్ళియున్నప్పుడు శిష్యులు యేసును అడిగిన ప్రశ్న ఈ విధంగా వుంది:

ఆయన ఒలీవల కొండమీద కూర్చుండియున్నప్పుడు శిష్యులాయన వద్దకు ఏకాంతముగా వచ్చి- "ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగ సమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనగా?" (మత్తయి 24:3)

యేసు, మొట్ట మొదటగా యెరూషలేము దేవాలయము పూర్తిగా నాశన ము చేయబడునని, రాతి మీద రాయి ఒకటైనను నిలువకుండ పడద్రోయబడునని చెప్పెను. అప్పుడు ఇశ్రాయేలు కొంతకాలము వరకు ఒక జాతిగా వుండకుండా ఉనికి కోల్పోవునని, ఆ కాలము తరువాత ఇశ్రాయేలు యూదా వారి ఆధీనంలోనికి తిరిగి వస్తుందని చెప్పియున్నాడు.

"వారు కత్తివాత కూలుదురు; చెరపట్టబడినవారై సమస్తమైన అన్యజనముల మధ్యకు పోవుదురు: అన్య జనముల కాలములు సంపూర్ణమగువరకు యెరూషలేము అన్యజనములచేత త్రొక్కబడును. మరియు సూర్య చంద్ర నక్షత్రములలో సూచకములును, భూమిమీద సముద్రతరంగముల ఘోషవలన కలవరపడిన జనములకు శ్రమయు కలుగును. ఆకాశమందలి శక్తులు కదిలింపబడును గనుక లోకము మీదికి రాబోవుచున్న వాటి విషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురుచూచుచు ధైర్యముచెడి కూలుదురు. అప్పుడు మనష్య కుమారుడు ప్రభావముతోను మహా మహా మహిమతోను మేఘారూఢుడై వచ్చుట చూతురు. ఇవి జరుగ నారంభించినప్పుడు మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలలెత్తికొనుడి, మీ విడుదల సమీపించుచున్నదనెను" (లూకా 21:24-28)

పై వచనాలన్నీ కూడా ఇశ్రాయేలు యొక్క చరిత్రను చూడగా గత 1900 సంవత్సరాల కాలంలో నెరవేర్చబడినాయి. క్రీస్తు తరువాత 70 సంవత్సరాల కాలంలో ఇశ్రాయేలు రోమా సైన్యము చేత నాశన ము చేయబడినది. యెరుషలేము లోనున్న దేవాలయము అగ్నిచేత కాల్చబడినది. మరియు నాగలిచేత భూమిని చదును చేసిన రీతిగా పట్టణము మరియు దేవాలయము అంతయు కూడా నేలమట్టమునకు కుదురుచేయబడినది. ఆ రీతిగా యేసు యొక్క పలుకులు నెరవేర్చబడినవి. ఆ సమయమున యూదులు ప్రపంచనలుమూలలకు వెడలిపోయారు. సమస్తమైన

ప్రతికూల పరిస్థితుల తరువాత 20 వ శతాబ్దంలో ఇశ్రాయేలు తిరిగి ఒక జాతిగా జీవం పోసుకున్నది. మే, 1948వ సంవత్సరంలో తిరిగి ఒక దేశంగా సంతరించుకున్నది. అంతేకాకుండా 1967 జూన్ లో ఆరు రోజులు యుద్ధంచేసి యెరూషలేము పట్టణమును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.

ఇంతటి అసాధారణమైన ఇశ్రాయేలు పునఃస్థాపన గురించి, ఆ సంఘటనలు జరిగే నాటికి సుమారు 2500 సంవత్సరాల క్రితమే ప్రవక్తయైన యెహెజ్కేలు ద్వారా వర్ణించబడింది.

యెహెజ్కేలు 37వ అధ్యాయంలో, ఒక లోయలో నిండియున్న ఎండిపోయిన ఎముకలన్నియు ఒక దానికొకటి కూర్చబడి అస్థిపంజరంగా మారు, ఒక దర్శనాన్ని దేవుని ద్వారా ప్రవక్తకు చూపబడింది, ఆ ఆస్తిపంజరములన్నియు మాంసము చేత పొదగబడి వాటి పాదములమీద నిలువ గలిగాయి. ఆ రీతిగా నమశక్యము కానటువంటి పై తెలుపబడిన సంఘటన, ఇశ్రాయేలు ఒక జాతిగా పునఃస్థాపన గావింపబడిన విధానం దేవుని యొక్క క్రియ అని వివరిస్తూ వున్నది. అంతే కాకుండా ఇశ్రాయేలు యొక్క పునఃస్థాపనను గురించి తెలిపే పై తెలిపిన ప్రవచనం, బైబిలు దేవుని యొక్క వాక్యమని విశ్వసించడానికి బలమైన సాక్షాధారమైవున్నది.

సుమారు 2500 సంవత్సరాల తరువాత భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను నమ్మశక్యముకానటువంటి విధంగా, మరియు నూటికి నూరు పాళ్ళు ఖచ్చితముగా తెలిపే వేరే ఏదైనా పుస్తకం వున్నదా?

లూకా 21:28లో ఇశ్రాయేలు పునఃస్థాపన గురించి, వేసవి కాలపు పంటకు ముందు అంజూరపు చెట్టు చిగురించే ఉపమానం ద్వారా చెప్పబడింది. బైబిలు గ్రంథమందు అంజూరపు చెట్టు ఇశ్రాయేలుకు సాదృశ్యంగా చెప్పబడింది. కనుక ప్రపంచము యొక్క నలుమూలలకు చెదరి పోయిన ఇశ్రాయేలు ప్రజలు తిరిగి తమ సొంత భూమికి చేరుకున్న సంఘటన , తప్పక జరిగెడు యేసు యొక్క రెండవరాకడకు, ప్రధానమైన సూచనగా గమనించగలం.

## రెండవదిగా, "అంత్యదినములలో" సంభవించెడు సూచనలు.

**Secondly, the signs of the 'last days'**

ఆయన రాకడకు ఇంకొక ప్రధానమైన సూచన, నేటి ప్రపంచంలో పేట్రేగిపోతున్న చెడుతనము మరియు అవినీతి. యేసు, తన రాకడకు ముందు ప్రపంచముయొక్క పరిస్థితి నోవాహు దినములలో జలప్రలయమునకు ముందున్న పరిస్థితి లాగానే వుంటుందని చెప్పియున్నాడు (మత్తయి 24:37) కేవలం రెండు విషయాలే, అనగా చెడుతనము, మరియు అవినీతి అనునవే నాటి కాలమునకు, నేటి ప్రస్తుత ప్రపంచమునకు, ఖచ్చితమైన పోలిక కలిగి యున్నది.

నోవాహు కాలములోని బైబిలు పరిస్థితులు

"భూలోకము దేవుని సన్నిధిని చెడిపోయి యుండెను; భూలోకము బలత్కారముతో నిండియుండెను.

దేవుడు భూలోకమును చూచినప్పుడు అది చెడిపోయియుండెను; భూమిమీద సమస్త శరీరులు తమ మార్గమును చెరిపివేసుకొని యుండిరి. దేవుడు నోవహును చూచి - సమస్త శరీరుల మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చి యున్నది; వారిని భూమితో కూడా నాశనము చేయుదును".

కనుక మనుష్యుల యొక్క ప్రవర్తన ఒకానొక స్థితిని మించి పోయినట్లైతే దేవుడు ఎంత మాత్రమును సహించడు అని పై వచనం విశదీకరిస్తుంది. ప్రస్తుత సమాజము నోవహు కాలములోని పరిస్థితిని మించిపోయివున్నది. వాటి పరిణామములను భరిస్తూవున్నది.

నీతి, న్యాయములకు సంబంధించి, నేటి సమాజము దినదినానికి దిగజారిపోతున్న విషయం సత్యమే. కనుక ఇదేరీతిగా చెడుతనము వ్యాప్తి చెందుతూ పోయినట్లైతే, అప్పుడు ఒకానొక రోజు ఆనాటి నోవాహు దినములలోని పరిస్థితికి తప్పనిసరిగా వస్తుంది దేవుడు తనయొక్క పరిమాణపు స్థాయినుంచి ఎంతమాత్రము మార్పు చెందడని మనము బైబిలు ద్వారా ఎంతో స్పష్టముగా ఎరిగి యున్నాము.

కొన్ని వేల సంవత్సరాల క్రితం ఏ తప్పిదం జరిగిందో అదే నేడూ జరుగుతున్నది. కనుక దేవుడు నేటి పరిస్థితికి తగినట్టుగా ఏదో ఒకటి తప్పకుండా చేస్తాడు.

ఆయన చేయబోయే క్రియ ఏంటంటే! తన అద్వితీయ కుమారుని తిరిగి ఈ భూమి మీదికి పంపించడమే. అపోస్తలుడైన పౌలు యేసు యొక్క పరలోక ఆరోహణమును మరియు ఆయన రెండవరాకడకు మధ్యకాలము గురించి ఈ విధంగా వర్ణిస్తున్నాడు.

"ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు". (అపో.కా. 17:31)

## నీతి బాహ్యమైన ఈ ప్రపంచము మీద దేవుని యొక్క తీర్పులు

**God's judgements of a wicked world**

ఎప్పుడైతే యేసు తిరిగి వచ్చునో, అప్పుడు ఈ లోకము తీర్పులోనికి కొనిపోబడును:

"ప్రభువైన యేసు తన ప్రభావమును కనపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని ఎరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని. ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును విశ్వసించిన వారందరి యందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్య నాశనమును దండన

పొందుదురు. ఏలయనగా మేము మీ కిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి". (2థెస్స 1:7 - 10)

దేవుడు ఈ భూమి మీద తన రాజ్యమును స్థాపించడం ముఖ్య ఉద్దేశ్యమై యుండగా, ఈ లోకము మీదికి ఆయన అంత కఠినమైన తీర్పులు విధించడం ఒకవేళ మనకు ఇష్టంలేకపోయియుండవచ్చు. అయితే హేతుబద్ధమైన కారణము ఏమనగా, దేవుని యొక్క కఠినమైన తీర్పులు సమస్తమానవజాతి, ఆయన ధార్మికమైన నీతిని అనుసరించడానికి అవసరములైయున్నవి, ఇంకొక విధంగా చెప్పవలెనంటే దేవుని మార్గములే సరియైనవని నేర్చుకొనుటకు మనుష్యులకు ఉపయోగ కరముగా నున్నవి.

"నీ తీర్పులు లోకమునకు రాగా లోకనివాసులు నీతిని నేర్చుకొందురు" (యెషయా 26:9)

ఎప్పుడైతే నీతిమంతులు ఈ భూమిని స్వతంత్రించుకొందురో, అప్పుడు దేవుడు సమస్తభూమిని శాంతి చేత స్థాపించును.

"నీతి సమాధానము కలుగజేయును నీతివలన నిత్యమును నిమ్మళము నిబ్బరము కలుగును". యెషయా (32:17)

ఇదే ప్రతి క్రిష్టమస్ దినమున ఉదహరించు వాక్యముల నిజమైన ప్రాముఖ్యతయై యున్నది: "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయన క్రిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగునుగాక" (లూకా 2:14)

పై వాక్యము వాస్తవంగా, ఈ భూమి మీద స్థాపింపబడు దేవుని రాజ్యమును సూచించునది అని చాలా మంది గ్రహించుటలేదు.

## "పరలోకమందు నెరవేరునట్లు భూమి మీదను నెరవేరును గాక"

**"On earth as it is in heavern"**

చాలా మంది రాజ్యము పరలోకములో స్థాపింపబడును అని నమ్ముతూ వున్నారు. ఎందుకనగా మత్తయి సువార్తనందు ఇది "పరలోక రాజ్యము" అని

వ్రాయబడివుంది (ఇతర సువార్తలందు ఇది, "దేవుని రాజ్యము" అని వ్రాయబడివుంది. అయితే రెండూ కూడా ఒకే "రాజ్యము" గురించే చెప్తూవున్నవి) అయితే మత్తయి సువార్త బోధనల ద్వారా ప్రభువు పర్వతము మీద చేసిన ప్రార్థనను బట్టి, రాజ్యము పరలోకము నుండి వచ్చును అని అంతేకాని పరలోకమందు వుండునది కాదని తెలిసికొనగలము.

"కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి, పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక" (మత్తయి 6:9,10)

## యేసు ఈ ప్రపంచమునకు కాబోవు రాజైయున్నాడు

**Jesus will be King of the world**

యేసు తిరిగి వచ్చినప్పుడు, ఇశ్రాయేలు తిరిగి పొందిన రాజ్యమునకు మాత్రమే రాజు కాడు, కానీ సమస్త భూమి యావత్తుకు ఆయనే రాజైవుండును, రాజ్యమును గూర్చిన ఎంతో ఆశ్చర్యకరమైన కీర్తన ఈ విధంగా వుంది;

"అతని దినములలో నీతిమంతులు వర్ధిల్లుదురు చంద్రుడు లేకపోవు వరకు క్షేమాభివృద్ధి కలుగును, సముద్ర మునుండి సముద్రము వరకు నది మొదలుకొని భూదిగంతములవరకు అతడు రాజ్యము చేయును". (కీర్తన 72:7-8)

యేసు, సమస్త భూమి యందంతట అన్ని కాలములలో నివసించిన విశ్వాసులతో పాటు రాజ్యపరిపాలన చేయును.

## దేవుని యొక్క తీర్పుల అవసరతలు

**The need for God's judgements**

దేవుడు తీర్పులు తీర్చని ఎడల, శాంతి కరమైన రాజ్యమును స్థాపింపబడగలదా అని కొన్ని సార్లు మనం ఆశ్చర్య పోవచ్చు. దీనికి సమాధానం తీర్పులు లేకుండా నిరాడంబరంగా రాజ్య స్థాపన జరుగదు.

రాబోవు దేవుని రాజ్యము, రద్దు చేయబడి వున్నట్లయితే భవిష్యత్తులో

ఏం జరుగుతుందో కొంచెం గమనిద్దాం. వచ్చు శతాబ్దమంతా కూడా ఆకలివలన, రోగముల వలన, యుద్ధములవలన, మరియు టెర్రరిజం వలన ఎంతమంది మరణిస్తారు? ఈ రకముగా బాధపడుతున్నటువంటివారిని దేవుడు మరియొక సారి రక్షిస్తాడా!

## రాజ్యము ఏ రీతిగా ఉండును?

**What will the kingdom be like?**

పరలోక సంబంధమైన రాజ్యమును గురించి బైబిలు గ్రంథమందు ఎంతో స్పష్టంగాను, ఆశ్చర్యపడే విధంగాను పెద్ద మొత్తంలో వ్రాయబడివుంది. కనుక ఆ రాజ్యము ఏ రీతిగా వుండునో మనం కనుగొందాం. దీనికి, సంబంధించిన వర్తమానము బైబిలు గ్రంథమందంటా కూడా వ్రాయబడివుంది.

మనము, పాత మరియు క్రొత్త నిబంధనల నుండి కొన్ని వచనాలను చూద్దాం. ఈ అంశం మీద ఈ కరపత్రములో కేవలం పైపైనే ఉన్నటువంటి వచనాలను సూచిస్తున్నాము.

## యుద్ధము ఇక వుండదు

**No more war**

ప్రస్తుత ప్రపంచమునకు మరియు రాజ్యమునకు వుండు ప్రధానమైనా తేడా, యుద్ధములు ఇక వుండవు మరియు యుద్ధాయుధములు ఇక ఎంత మాత్రము కనిపించవు.

"ఆయనే భూదిగంతములవరకు యుద్ధములు మాన్పువాడు విల్లు విరుచువాడును, బల్లెమును తెగనరుకువాడును ఆయనే యుద్ధ రథములను అగ్నిలో కాల్చివేయువాడు ఆయనే". (కీర్తన 46:9)

ప్రస్తుత కాలంలో ప్రపంచము పూర్తిగా యుద్ధాయుదాల చేత నిండుకొనివుంది. మిక్కిలి పెద్దమొత్తంలో ధనాన్ని, సమయాన్ని, శక్తిసామార్థ్యాలను నేడు యుద్ధోపకరణాల కొరకు ఉపయోగిస్తున్నటువంటి సమస్తము రాజ్యములో ఎంతో

ఉపయోగకరమైన, మరియు లాభసాటి అయిన ఉపకరణాలుగా వాడబడతాయి. "ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును అనేక జనములకు తీర్పు తీర్చును. వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను తమ యీటెలను మచ్చుకత్తులుగాను సాగగొట్టుదురు జనము మీదకి జనము ఖడ్గమెత్తక యుండును యుద్ధము చేయు నేర్చుకొనుట ఇక మానిపోవును" (యెషయా 2:4)

## ఆకాలమున ప్రతి ఒక్కరు దేవుని గురించి తెలిసికొందురు

**Everyone will know about God**

"వారిలో ఎవడును- ప్రభువును తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను తన సహోదరునికైనను బోధింపడు వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరును నన్ను తెలిసికొందురు" (హెబ్రీ 8:11, యిర్మియా 31:24)

మనము ఇతర వచనాలను చూసినట్లుగా ప్రతి ఒక్కరు ఆయనే దేవుడని నమ్మడం మాత్రమే కాదు కాని దేవుని యొక్క ఆశ్చర్యకరమైన, ఖచ్చితమైన నీతితో కూడిన గుణమును కూడా గ్రహిస్తారని అర్థము.

## రాజ్యము యొక్క ముఖ్య ఉద్దేశ్యము

**The purpose of the kingdom**

దేవుడు ఈ భూమి మీద రాజ్యాన్ని స్థాపించడానికి తన కుమారుని ఎందుకు పంపించబోవుచున్నాడు? ఎందుచేతనంటే ఆయన స్వరూపమందున్న పురుషుల మరియు స్త్రీల చేత ఈ భూమిని నింపడానికే. సృష్టి ఆరంభమందు దేవుడు ఈ భూమిని సృజించినప్పుడు ఆయన ఉద్దేశ్యమేమైయుండేదో ఈ క్రింది విధంగా చదవగలం

"దేవుడు - మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" (ఆది.కా. 1:26)

దీనియొక్క భావమేమి? ఆదాము మరియు హవ్వ దేవునియొక్క స్వరూపము చొప్పున సృజించబడినారు మరియు దేవుని వలె మార్పుచెందడానికి

కూడా వారికి తగిన శక్తి వుండేది, వారు ఒకానొక రోజు దేవునియొక్క సహజమైన స్వరూపమును, ప్రతిబింబించుటకు తగిన విధంగా రూపింపబడినారు.

అయితే ఏదేను తోటలో, ఆదాము హవ్వలు, తమ ఇష్టప్రకారముగా జీవిస్తారా! లేక తనకు విధేయత కలిగి జీవిస్తారా. అని వారిని దేవుడు పరీక్షించడం జరిగింది. వారు ఈ పరీక్షయందు విఫలంచెంది, మరణించు ప్రాణులుగా మార్పు చెందారు. అంతటితో ఆగిపోలేదు కాని ఆ క్షణమందే దేవుడు యేసు క్రీస్తు ద్వారా విమోచనమును కలుగజేసి ఆయన యొక్క సంకల్పాన్ని క్రియారుపంలో వుంచాడు.

ఆదాము మరియు హవ్వ యొక్క సంతానంలో యేసు క్రీస్తు ఒక్కడే, దైవలక్షణ ములతో, ఆయునకు విధేయత కలిగి జీవించాడు. యేసు, ఆయన శిష్యులలో ఒకడైన ఫిలిప్పుకు ఈ విధంగా చెప్పాడు.

యేసు - ఫిలిప్పూ, నేనింతకాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనపరచుమని ఏల చెప్పుచున్నావు? (యోహాను 14:9)

ఎప్పుడైతే శిష్యులు యేసుతో పాటు వున్నారో, దాని అర్ధం దేవుడే వారితో పాటు వున్నట్లేనా! (ఎందుకనగా యేసు తనకు తాను దేవుని కుమారుడనని చెప్పుకున్నాడు యోహాను 14:28)

ఈ భూమి మీద స్థాపింపబడు రాజ్యంలో యేసు మనతో పాటు వున్నప్పుడు పై విషయం సంపూర్ణం కాబడుతుంది.

"ఏలయనగా సముద్రము జలములతో నిండి యున్నట్లు భూమి యెహోవా మహాత్మ్యమును గూర్చిన జ్ఞానముతో నిండియుండును." (హబక్కూకు 2:14)

పై వచనాన్ని బట్టి ప్రతి ఒక్కరు కూడా దేవుని గూర్చి తెలిసికుంటారు. అయితే ఇది నిజంకాడానికి ఎంతో శిక్షణ అవసరమైయున్నది. ఆ రాజ్యములో దేవుని గూర్చిన జ్ఞానమును పొందడానికి యెరూషలేము ప్రధాన కేంద్రంగా వుంటుంది అదే శాంతినగరము.

# యెరూషలేము ప్రపంచమునకు ప్రధాన పట్టణము

**Jerusalem the capital of the world**

"యూదాను గూర్చియు యెరూషలేమును గూర్చియు ఆమోజు కుమారుడైన యెషయాకు దర్శనము వలన కలిగిన దేవోక్తి -

అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వత శిఖరమున స్థిరపరపరచబడి కొండల కంటే ఎత్తుగా ఎత్తబడును, ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు, ఆ కాలమున సీయోను లోనుండి ఉపదేశము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి - యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు. ఆయన మధ్య వర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును అనేక జనములకు తీర్పు తీర్చును." (యెషయా 2:1-4)

ఈ దినమున ఉన్నట్టుకాకుండా, యెరూషలేము పట్టణము యొక్క నమూనా పూర్తిగా మార్పు చెందును. యేసు ఒలీవల కొండలనుంచి పరలోకమునకు ఆరోహణమై పోయినప్పుడు, దూతలు శిష్యులకు ప్రత్యక్షమై ఆయన ఏ రీతిగా ఆరోహణమై వెళ్ళాడో అదే రీతిగా తిరిగి ఈ భూమి మీదికి వచ్చును అని తెలియజేశారు.

ఆయన రాక సరిగ్గా ఆరోహణమై వెళ్ళిన రీతిగానే వుంటుంటే అనగా 'అదేరీతిగా' ఒలీవల కొండలపైకి ఆయన తిరిగి వస్తాడు. అయితే క్రింది వచనాలు ఈ రీతిగా తెలియజేస్తున్నాయి.

జెకర్యా 14:4లో యేసు తిరిగి ఒలీవల కొండ మీదికి తిరిగి వస్తాడని వ్రాయబడి వుంది అంతేకాకుండా ఆయన పాదము ఒలీవల కొండలను తాకిన వెంటనే అది రెండు భాగములుగా విడిపోవునని, సగము పర్వతము ఉత్తరమునకును ఇంకొక సగము దక్షిణమునకును జరుగును అని చదవగలం మనము కొంచెం ఊహించినట్లైతే ఈ సంఘటన పెద్ద భూకంపమును కలిగించి సమస్త ప్రపంచము మీద ప్రభావమును చూపించగలదు అప్పుడు యెరూషలేము యొక్క ప్రధాన

ప్రాంతము (సీయోను పర్వతము) చుట్టుప్రక్కలవున్న కొండలకంటే ఎంతో అత్యున్నత స్థాయికి ఎత్తబడును.

## క్రొత్త మందిరము

**The New Temple**

ఈ పర్వతమున నూతనమైన మందిరమును స్థాపించును. యెహెజ్కేలు గ్రంథమందు వివరించినట్లుగా, ఆ మందిరము యొక్క నమూనా ప్రధానమైన కొలతలను బట్టి చిత్రీకరించవచ్చును. ఆ మందిరము యొక్క ప్రణాళిక ఈ క్రింది విధంగా వుంటుంది.

యెహెజ్కేలు **40-48**, అధ్యాయముల ప్రకారము ఆమందిరము చతురస్రాకారముగా వుండి, ఒక్కొక్కవైపు 1:37 కి.మీ. పొడవు, చుట్టుముట్టు నడుమకి 1.1 కి.మీ. వెడల్పు ఈ భాగము సీయోను పర్వతము అంతటను కమ్ముకొనును. ఆ పర్వతము యొక్క నడుమ నుంచి ఒక జల ప్రవాహముపైకి లేచును. ఆ తరువాత పర్వతము మీదుగా క్రిందికి జారి మందిరము నలువైపులా ప్రవహించి ఒక నదిగా మారి చివరికి మృత సముద్రంలో కలసి పోవును. ఆ సందర్భంలో ఈ సముద్రము పూర్తిగా జీవముతో నిండుకొనివుండును (యెహె 47) అప్పుడు మనము దీనిని "జీవసముద్రము" అని పిలువగలుగతామేమో.

## యెరూషలేము యొక్క భాగములు

**Features of Jerusalem**

యెరూషలేము, సీయోను యొక్క ప్రధాన పట్టణము పర్వతమునకు ఉత్తరమున స్థాపింపబడును.

"మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు యెహోవా గొప్పవాడును బహు కీర్తనీయుడునై యున్నాడు. ఉత్తర దిక్కున మహారాజు పట్టణమైన సీయోను పర్వతము" (కీర్తన 48:1-2)

ఇంతకు ముందెన్నడూ లేని విధంగా, యెరూషలేము ప్రపంచమునకు

ప్రధాన పట్టణమౌతుంది. నిస్సందేహముగా ఎంతో దివ్యభరితమైన నివాసయోగ్యమైన గృహములు, ఎంత మనోహరంగా వుంటాయో ఒక్కసారి వూహించండి. భక్తి సంభ్రమును కలిగించు ఎంతో వైభవముతో కూడిన గృహాలలో ప్రజలు నివసిస్తారు.

"రాజులు కూడిరి వారు ఏకముగా కూడివచ్చిరి వారు దాని చూచినవెంటనే ఆశ్చర్యపడిరి భ్రమపడి త్వరగా వెళ్ళిపోయిరి" (కీర్తన 48:4-5)

నూతనమైన యెరూషలేము పట్టణము ఏ రీతిగా వుంటుంది? న్యూయార్క్ పట్టణమువలే వుంటుందా? కాదు కానీ, నేటి దినాలలో కంటె ఎంతో శాంతి యుతమైన జీవితం ఆ రాజ్యంలో వుంటుంది.

"ఉత్సవకాలములలో మనము కూడుకొనుచున్న సీయోను పట్టణమును చూడుము, నిమ్మళమైన కాపురముగాను తియ్యబడని గుడారముగాను"(యెషయా 33:20)

· అంతే కాకుండా, ప్రపంచమునకు ప్రధాన పట్టణమునకు తగిన రీతిగా ఆదీన రేఖలు లేక సువిశాలంగా వుంటుంది. అది ఒక పచ్చికమైదానములతో కూడుకొనిన ఒక తోటవలె వుంటుంది.

"మనుష్యులును పశువులును, విస్తారమైనందున అది ప్రాకారములేని మైదానము వలేవుండునని" (జెకర్యా 2:4)

అదే రీతిగా యెరూషలేములోని గృహములు, ప్రస్తుత దినాలలో మాదిరిగా కాకుండా, బంగారు వర్ణముతో కూడిన రాళ్ళచేత కట్టబడును. దూరమునుంచి చూసినప్పుడు ఆ పట్టణము ఎంతో మనోహరముగా కనిపించును ఆ పట్టణమునకు ముందు వైపు దేవుని యొక్క మందిర పర్వతము ఆకాశములోనికి ఎత్తబడియుండుట చూస్తాము.

జెకర్య 8:4-5 వచనాలను చూసినట్లైతే ఆ పట్టణము యొక్క లోపలి వీధులు ఏ రీతిగా వూంటాయో - అందరును వృద్ధత్వము చేత కఱ్ఱ పట్టుకొని, వృద్ధులేమి వృద్ధరాండ్రేమి ఇంకను యెరూషలేము వీధులలో కూర్చుందురు. ఆ పట్టణపు వీధులు ఆటలాడు మగపిల్లలతోను ఆడ పిల్లలతోను నిండియుండును.

నేటి నగరాల వలె - కార్లతోను, బస్సులతోను, టాక్సీలతోను, పెద్ద శబ్దాలతో పొగనదులుతూ కాకుండా ఎంతో ప్రత్యేకమైన రీతిగా వుంటుంది.

## ఆ రాజ్యములోని నగరములు

**Cities in the Kingdom**

యెరూషలేము కాకుండా, ఆ రాజ్యంలో వేరే ఇతర పట్టణాల ఏమైనావుంటాయా? నేటి సమాజముల వలే కాకుండా, ప్రజలు ఎంతో దూరముగా వ్యాప్తి చెందివుంటారు.

అప్పుడు నా జనులు విశ్రయం స్థలమునందును ఆశ్రయం స్థానములయందును సుఖకరమైన నివాసముల యందును నివసించెదరు. (యెషయా 32:17)

అయినను అరణ్యము ధ్వంసమగునప్పుడు వడగండ్లు పడును, పట్టణము నిశ్చయముగా కూలిపోవును. (యెషయా 32:18-19)

ప్రస్తుత దినాలలో ప్రపంచములోని అతి పెద్ద నగరాలు నేరాలు చేత నిండివున్నవి మనము ఏ నగరములో అయితే జీవన విధానం బాగుంటుందో అని ఒక దానితో ఒకటి పోల్చి చూపినప్పుడు, మనకు బాగా అర్థమవుతూ వుంటుంది. అయితే రాజ్యములోని పట్టణములకు సంబంధించి, ఈ రకమైన నేరాలతో కూడిన సమస్యలు ఎంతమాత్రము ఉండవు. అంతే కాకుండా ప్రపంచములోని ఎన్నో పట్టణాలను చూసినట్లైతే, గృహాలు ఒక దానితో ఒకటి అతుక్కుపోయేలా కట్టబడివుంటాయి. (అవి భూమికి సమాంతరంగా కానీ లేక లంభంగా కానీ )

అయితే మనషి ఈ రీతిగా జీవించాలని దేవుడు ఎప్పుడూ కోరుకోలేదు.

"స్థలము మిగులకుండ మీరు మాత్రమే దేశములో నివసించునట్లు ఇంటికి ఇల్లు కలుపుకొని పొలమునకు పొలము చేర్చుకొను మీకు శ్రమ". (యెషయా 5:8) అయితే దేవుని రాజ్యంలో ప్రజలు తమ సొంత ఇండ్లను నిర్మించుకోడానికి తగిన సమయం వుంటుంది.

"జనులు ఇండ్లు కట్టుకొని వాటిలో కాపురముందురు ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలములననుభవింతురు". (యెషయా 65:21)

## ఆ రాజ్యములోని వాతావరణము

**The environment in the kingdom**

నేటి రోజుల్లో ప్రపంచ వాతావరణ స్థితుల గురించి ఒక పెద్ద సమస్యగా మారింది, అయితే దేవుని రాజ్యము స్థాపింప బడినప్పుడు ప్రపంచము యొక్క వాతావరణ స్థితి ఎలావుంటుంది? భూమండలము యొక్క స్థితి ఎలా వుంటుందో ఎక్కువగా వివరించడంలేదు కానీ ఈ రోజుల్లో కంటే రాజ్యము స్థాపింపబడినప్పుడు వ్యవసాయానికి సంబంధించిన వాటి మీద సమాజము ఎక్కువగా ఆధారపడివుంటుంది. అంతే కాకుండా ఆ కాలమున ప్రపంచమంతా కూడా ఎంతో పరిశుద్ధంగా వుంటుంది. ప్రవక్తయైన యెషయా గ్రంథము ద్వారా ఇశ్రాయేలు భూభాగమందు ఆ రాజ్య కాలంలో జరిగే కొన్ని మార్పులను తెలియజేస్తున్నాము.

"అరణ్యమును ఎండిన భూమియు సంతోషించును అడవి ఉల్లసించి కస్తూరి పుష్పమువలె పూయును అది బహుగా పూయుచు ఉల్లసించును ఉల్లసించి సంగీతములు పాడును లెబానోను సౌందర్యము దానికి కలుగును కార్మెలు షారోనులకున్న సొగసు దానికుండును అవి యెహోవా మహిమను మన దేవుని తేజస్సును చూచును" (యెషయా 35:1-2)

పై వచనాలను బట్టి, ఇది ప్రపంచములోని అన్ని ఎడారులకు వర్తిస్తుందా? అని అడగవచ్చు.

ఇంకా గోబి ఎడారి, సహారా, సౌది అరేబియా - భూమిమీద పూర్తిగా ఎండిపోయివున్న భూములకు కూడా వర్తిస్తుందా? అనే సందేహం కలుగవచ్చు, అయితే ఇక్కడ ఎడారికి, ఎడారి కాని దానికి వున్న తేడా నీరు మాత్రమే అన్న సంగతి మనం గుర్తించవలసివుంటుంది. క్రింది వచనాలు ఎడారి నీళ్ళ చేత ఎలా జీవంపోసుకుంటుందో వివరిస్తుంది.

"కుంటివాడు దుప్పివలె గంతులువేయును, మూగ వాని నాలుక పాడును, అరణ్యములో నీళ్ళు ఉబుకును, అడవిలో కాలువలు పారును, ఎండమావులు మడుగులగును ఎండిన భూమిలో నీటిబుగ్గలు పుట్టును నక్కలు పండుకొనిన వాటి ఉనికి పట్టులో జమ్మును తుంగగడ్డియు మేతయు పుట్టును" (యెషయా 35:6,7)

## ఇక ఆకలి ఎంతమాత్రము వుండదు

**No more hunger**

నేటి దినాల్లో ఆకలి చేత జీవిస్తున్నటువంటి వారు ప్రపంచంలో ఎందరో వున్నారు. ఆశ్చర్యపడవలసిన విషయం ఏంటంటే, ఈ సమస్య ఆహారం లేకపోవడం వలన కాదు ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి కావలసినంత ఆహారం సమృద్ధిగా వుంది. అసలు సమస్య ఏంటంటే, మిక్కిలి బీద ప్రజలు ఆహారాన్ని కొనడానికి కావలసినంత డబ్బు వారియొద్ద లేక పోవడమే. ఆర్థికంగా డబ్బులేనటువంటివారు, వారికి కావలసిన ఆహారాన్ని వ్యవసాయం ద్వారా పండించుకోవచ్చుకదా? అని మనం ప్రశ్నించవచ్చు.

ప్రధానంగా చాలా మంది బీదవారికి ఇసుక భూములు మాత్రమే మిగిలాయి. అవి ఆహారాన్ని ఉత్పత్తి చేయవు. ఇంకా వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వారు కూడా, వారు పండించే ఆహార ధాన్యానికి సరిపడ వెలను పొందడంలేదు, ఇక వారికి ఆహారమేమైనా దొరుకుతుందంటే, అది భూస్వాముల దగ్గర అప్పులు చేయడం ద్వారా మాత్రమే. ఎందుకంటే వారు విత్తానాల కొరకు చేసిన ఋణం, మరియు వ్యవసాయ పనిముట్ల కొరకు తీసుకున్న ఋణం, ఇవన్నీ కూడా వారి పంటను అమ్మిన వెలకంటే ఎక్కువగానే వుంటుంది.

అయితే రాజ్యంలో ఈ బీదరికానికి మరియు ఆకలికి వున్న సంబంధం కొట్టివేయబడుతుంది. ప్రజలు బీదరికం వలన ఇక ఎన్నటికి కూడా ఆకలిని చవిచూడరు

"నిరుపేదలయందును బీదల యందును అతడు కనికరించును బీదల ప్రాణములను అతడు రక్షించును" (కీర్తన 72:13)

ఇంత వరకు కూడా ప్రపంచ ఆహార ఉత్పత్తి ప్రపంచజనాభా మీద ఆధారపడి జరుగుతూవుంది (క్రీస్తు రావడం ఆలస్యమైతే)

ఒక వేళ భవిష్యత్తులో ఈ పద్ధతి మారవచ్చు. ప్రపంచ ఆహార అభివృద్ధి, వ్యవసాయానికి సంబంధించిన నీటి కాలువలమీద, ఎరువుల మీద, క్రిమిసంహారకమందుల మీద ఆధారపడివుంది.

అయితే రాజ్యములో ఆహార ఉత్పత్తి, ఎరువుల మీద, క్రిమిసంహారక మందుల మీద ఎంతమాత్రము ఆధారపడి వుండదు. అయితే ఆహార అభివృద్ధి

లేక ఉత్పత్తి ఎంతో సులువుగా వుంటుంది:

"దేశములోను పర్వత శిఖరముల మీదను సస్యసమృద్ధి కలుగును. దాని పంట లెబానోను వృక్షములవలె తాండవ మాడుచుండును, నేలమీది పచ్చికవలె పట్టణస్థులు తేజరిల్లుదురు". (కీర్తన 72:16)

పై వచనం మనకు ఎంతో సమగ్రమైన సమాచారం అందిస్తుంది - పర్వత శిఖరములమీద పంట పండించగలిగినప్పుడు అప్పుడు ఎక్కడైనా సరే ఖచ్చితంగా పంట పండించవచ్చు.

దేవుడు స్థాపించు మహిమగల రాజ్యంలో వ్యవసాయదారుల యొక్క పంటను ఇతరులు అనుభవించరని యెషయా ఈ విధంగా తెలియజేస్తున్నాడు.

"జనులు ఇండ్లు కట్టుకొని వాటిలో కాపురముందురు ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలముల ననుభవింతురు. వారు కట్టు యిండ్లలో వేరొకరు కాపురముండరు. వారునాటుకొన్న వాటిని వేరొకరు అనుభవింపరు నా జనుల ఆయుష్యము వృక్షాయుష్యమంత యగును, నేను ఏర్పరచుకొనినవారు తాముచేసికొనిన దాని ఫలమును పూర్తిగా అనుభవింతురు" (యెషయా 65:21-22)

ఆమోసు కూడా అదే విషయం తెలియజేస్తున్నాడు:

"రాబోవు దినములలో కోయువారు దున్నువారి వెంటనే వత్తురు; విత్తనము చల్లువారి వెంటనే ద్రాక్షపండ్లు త్రొక్కువారు వత్తురు; పర్వతములనుండి మధురమైన ద్రాక్షరసము స్రవించును. కొండలన్ని రసధారలగును; ఇదే యెహోవా వాక్కు. మరియు శ్రమనొందుచున్న నా జనులగు ఇశ్రాయేలీయులను నేను చెరలోనుండి రప్పింతును, పాడైన పట్టణములను మరల కట్టుకొని వారు కాపురముందురు". "ద్రాక్షాతోటలు నాటి వాటి రసమును త్రాగుదురు, వనములువేసి వాటి పండ్లను తిందురు". ( ఆమోసు 9:13-14)

పై వచనాలను బట్టి, ఆ దృశ్యం చూసినట్లైతే పొలమును దున్నువారు, విత్తువారికి కావలసినంత ఆహారము దొరుకు వరకు, పొలమును చదును చేయరు అని అర్థమౌతుంది.

## జంతురాజ్యంలో జరుగుమార్పులు

**Changes to the animal kingdom**

దేవుడు స్థాపించు రాజ్యంలో కొన్ని జంతువుల యొక్క సహజమైన లక్షణాలలో లేక గుణాలలో కొన్ని మార్పులు సంభవించును:

"తోడేళ్ళును గొఱ్ఱెపిల్లలను కలిసి మేయును సింహము ఎద్దువలె గడ్డి తినును సర్పమునకు మన్ను ఆహారమగును నా పరిశుద్ధ పర్వతములో అవి హానియైనను నాశనమైనను చేయకుండును," అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. (యెషయా 65:25)

"తోడేలు గొఱ్ఱెపిల్ల యొద్ద వాసము చేయును చిఱుతపులి మేకపిల్ల యొద్ద పండుకొనును దూడయు కొదమసింహమును పెంచబడిన కోడెయు కూడుకొనగా బాలుడు వాటిని తోలును. ఆవులు ఎలుగులు కూడిమేయును వాటి పిల్లలు ఒక్కచోటనే పండుకొనును ఎద్దు మేయునట్లు సింహము గడ్డిమేయును పాలుకుడుచుపిల్ల నాగుపాము పుట్టయొద్ద ఆట్లాడును మిడినాగు పుట్టమీద పాలువిడిచిన పిల్ల తన చెయ్యిచాచును నా పరిశుద్ధ పర్వతమందంతటను ఏ మృగమును హాని చేయదు నాశనము చేయదు సముద్రము జలములలో నిండియున్నట్లు లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును" (యెషయా 11:6-9)

ఆ రాజ్యంలో జరగబోయే అసాధారణమైన మార్పులు ఎన్నో వున్నాయి. ఒక సింహము ఇంకొక సింహము మీద అజమాయిషి చలాయించవలసివుండగా, ఒక బాలుడు సింహాన్ని పూర్తిగా అదుపులో ఉంచుకోవడం అంటే ఒక్కసారి ఆ దృశ్యం ఎలావుంటుందో ఊహించండి!

## అజ్ఞాన సంబంధమైన నిరక్షరాస్యతకు ముగింపు

**The end of illiteracy**

ప్రపంచంమొత్తం మీద సుమారు 6000 మాతృభాషలు వున్నాయి. ఎక్కువ మంది ప్రజలు, చైనా, ఇంగ్లీషు , హిందీ మరియు స్పానిష్ భాషలు

మాట్లాడుతున్నప్పటికీ, విశ్వవ్యాప్తమైన భాషను సమస్త భూమి మీద వున్న ప్రజలు మాట్లాడగలుగుతారు. ఇది ఎంతో మంచి విషయం ఎందుకనగా ప్రపంచంలోని ప్రతి ఒక్కరు కూడా తమ తోటి వారితో ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా మాట్లాడవచ్చు. అయితే దేవుని యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం ఒకే భాషను మాట్లాడ్డం వలన సమస్త జనాంగము లన్నియు ఐఖ్యత కలిగి దేవుని ఆరాధించగలగడమే.

"అప్పుడు జనులందరు యెహోవా నామమును బట్టి ఏక మనస్కులై ఆయనను సేవించునట్లు నేను వారికి పవిత్రమైన పెదవుల నిచ్చెదను". (జెఫన్యా 3:9)

నిరక్షరాస్యత అన్నది నేటి ప్రపంచంలో అంతటకూడా సర్వసాధారణమైన విషయమే. ఎందుకనగా ప్రజలు వారు చదువ, వ్రాయ గలిగిన భాష కాకుండా, ఒక క్రొత్త భాష జాతీయ భాషగా వుంటుంది.

అయితే దేవుని రాజ్యంలో, ప్రజలు వారి ప్రాంతీయ భాషను కూడా కలిగివుంటారు.

"సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చున దేమనగా - ఆ దినములలో ఆయా భాషలు మాటలాడు అన్యజనులలో పదేసిమంది యొక యూదుని చెంగుపట్టుకొని దేవుడు మీకు తోడుగా ఉన్నాడను సంగతి మాకు వినబడినది గనుగ మేము మీతో కూడా వత్తుమని చెప్పుదురు". (జెకర్యా 8:23)

## అద్భుతమైన స్వస్థతలు

**Miraculous healing**

దేవుని రాజ్యంలో ఎన్నో రకాలైన జబ్బులు అద్భుతంగా స్వస్థపరచబడును: "గ్రుడ్డివారు కన్నులు తెరవబడును, చెవిటివారి చెవులు విప్పబడును కుంటివాడు దుప్పివలె గంతులు వేయును, మూగవాని నాలుక పాడును అరణ్యములో నీళ్ళు ఉబుకును, అడవిలో కాలము పారును". (యెషయా 35:5-6)

మరియు, ప్రకటన 22:2 ఈ విధంగా తెలియజేస్తుంది

"ఆవృక్షము యొక్క ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించును" కనుక యెరూషలేము ప్రపంచము యొక్క వైద్య అవసరతలకు

ప్రధాన కేంద్రంగా వుండును.

## ప్రజలు బహుకాలము జీవించెదరు

**People will live longer**

నేను యెరూషలేమును గూర్చి ఆనందించెదను నా జనులను గూర్చి హర్షించెదను రోధన ధ్వనియు విలాపధ్వనియు దానిలో ఇకను వినపడవు. అక్కడ ఇకను కొద్ది దినములే బ్రతుకు శిశువులుండరు. కాలమునిండని ముసలివారుండరు. బాలురు నూరు సంవత్సరముల వయస్సు గలవారై చనిపోవుదురు పాపాత్ముడై శాపగ్రస్తుడగువాడు సహితము నూరు సంవత్సరములు బ్రదుకును.

దీని అర్థము 100 సంవత్సరముల వయస్సుగల పిల్లలు అప్పటికీ గోచీతో వుంటారని కాదు కానీ ఎవరైనా వంద సంవత్సరాల వయస్సులో మరణిస్తే, అప్పటికి కూడా వారు పిల్లల వయస్సే కలిగివుంటారని. వారు ఇంకా ఎక్కువ కాలం జీవించడానికి సామర్థ్యం కలిగే వుంటారని అర్థం.

"నా జనుల ఆయుష్యము వృక్షాయుష్యమంత యగును" (యెషయా 65:22)

పై వచనాన్ని బట్టి, వృక్షాలు ఎన్నో వందల సంవత్సరాల జీవముకలిగివుంటాయి అని, అదే రీతిగా దేవుని రాజ్యంలో ప్రజలు కూడా కొన్ని వందల సంవత్సరాలు జీవిస్తారని పై వచన భావమైయున్నది. (నోవహు జలప్రళయమునకు ముందున్న ప్రజల ఆయుష్కాలమంత)

## దేవుని రాజ్యంలో ప్రజలు ఏం చేస్తుంటారు?

**What will people do in the kingdom?**

ఇంతవరకు మనము నేర్చుకున్న దాన్ని బట్టి దేవుని యొక్క రాజ్యం, నేడున్న దానికంటె ఎంతో శాంతియుతంగా, నిశ్శబ్దంగా వుంటుందని గ్రహించాము. ఆ రాజ్యములో ప్రజలు ఎక్కువ ఆయుఃష్కాలము కలిగివుండినప్పుడు, వారి చేతిలో ఎంతో సమయమువుంటుంది. నేటి రోజుల్లో అయితే ప్రజలు వారి యొక్క

విరామ సమయాలలో దేనికి పనికిరాని టెలివిజన్ చూడ్డం వలన గడిపేస్తారు. అయితే దేవుని రాజ్యంలో ప్రజల ఆలోచించడానికి, ఒకరితో ఒకరు మాట్లాడుకోడానికి, ప్రపంచ స్థితిగతుల గురించి చర్చించుకోడానికి, మరీ ముఖ్యంగా దేవుని గూర్చిన విషయాలను నేర్చుకోడానికి ఉపయోగిస్తారు.

## ఆ రాజ్యము ఎంత కాలము వుంటుంది?

**How long will the kongdom will last?**

ప్రకటన గ్రంథము, ఆ రాజ్యము వెయ్యి సంవత్సరములు వుంటుందని చెప్తావుంది.

"అంతట సింహాసనములను చూచితిని; వాటిమీద ఆసీనులై నుండువారికి విమర్శచేయుటకు అధికారము ఇయ్యబడెను. మరియు క్రూరమృగమునకైనను దాని ప్రతిమకైనను నమస్కారము చేయక, తమ నొసళ్లయందు గాని చేతులయందు గాని దాని ముద్రవేయించుకొనని వారిని, యేసు విషయమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తమును దేవునివాక్యము నిమిత్తమును శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలను చూచితిని. వారు బ్రదికిన వారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడా రాజ్యము చేసిరి" (ప్రకటన 20:1-4)

## ఆ రాజ్యము యొక్క అంతమున ఏం జరుగుతుంది?

**What will happen at the end of the kongdom?**

దేవుని యొక్క రాజ్యము నిజముగానే ఎంతో ఆశ్చర్యకరంగా వుంటుంది. అయితే పురుషులను, స్త్రీలను, ఆయన పోలికచొప్పున ఆయన స్వరూపముతో ఈ భూమిని నింపడానికి (లేక ఆయన మహిమతో) ఆ రాజ్యము కేవలము పునాదిరాయి మాత్రమే. ఎప్పుడైతే సంపూర్ణంగా ఆయన యొక్క మహిమతో ఈ భూమి యావత్తు నిండుకొని వుంటుందో అప్పుడు మరణమనునది పూర్తిగా కొట్టివేయబడుతుంది.

"అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన

అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నసింపజేయబడు శత్రువు మరణము........ దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును" (1 కొరింథి 15:24-28)

కనుక మరణమనునది చివరికి నసింపజేయబడును. అనగా అప్పటినుంచి, మరణమునొందుట ఇక వుండదు. ప్రతి ఒక్కరు కూడా అమర్త్యతను కలిగివుండి పాపరహితంగాను, దేవునితో సమానమైన స్థితిని కలిగివుందురు. "అప్పుడు దేవుడు సర్వములో సర్వమగును".

ఆ యొక్క రాజ్యాంతమున దేవుని యొక్క మహిమ భూమి యావత్తు నిండుకొనివుండును. అందువలన దేవునికి మనుష్యునికి మధ్య అడ్డుగా నిలుచునది ఏదీవుండదు అనగా, దేవుడు తనకు తాను ఈ భూమిని దర్శించడానికి అర్హత కలిగివున్నాడని దీని భావమైవున్నది.

"అప్పుడు - ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడుచివేయును, మరణము ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని" (ప్రకటన 21:3-4)

ఈ మహిమగల అంతము గురించి, యేసు కొండమీద ఉపన్యాసంలో ముందుగానే చెప్పియున్నాడు;

"హృదయ శుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8)

## ముగింపు

### Conclusion

మనము దేవుని రాజ్యమును గురించి సమస్తమైన పరిశీలనచేసి ముగింపునకు వచ్చియున్నాము. మనము పరిశుద్ధ గ్రంథమును చదువుతూ సునిశిత పరిశీలనతో

అభ్యసించిన యెడల, అది దేవుడు మనకొరకు ఏర్పాటు చేసివున్నటువంటి సమ్మతమైన మరియు నమ్మదగిన రాజ్యము అని గ్రహించగలము. ఇప్పటికైతే ఆ రాజ్యము రాలేదు కానీ, భవిష్యత్తులో తప్పక స్థాపింపబడునదైయున్నది. ఎందుకనగా, దేవుడు ఏదైనను జరగవలెనని సంకల్పించినయెడల, అది తప్పక జరుగును.

ప్రస్తుత ప్రపంచ స్థితిని మనము చూసినట్లైతే, దేవుని రాజ్యన్ని స్థాపించడానికి, యేసు ఈ భూమి మీదికి తిరిగి రావాలనే కోరుకుంటాము. ఆయన రాకడకు మనం సిద్ధపడవలెనంటే, సువార్తను నమ్మవలసిన అవసరం ఎంతో వుంది. మనయొక్క సమస్తమైన అపరాధములకొరకు పశ్చాత్తాపపడి, రక్షణార్థమైన యేసు క్రీస్తు నామములోనికి బాప్తిస్మం పొందవలసివుంది.

"నమ్మి బాప్తిస్మం పొందిన వాడు రక్షింపబడును నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16)

ఏది ఏమైనను ఈ బాప్తీస్మం అనునది కేవలం ప్రారంభము మాత్రమే. మన రక్షకుడు, ప్రభువైన యేసు యొక్క అడుగుజాడల్లో నూతనమైన జీవితాన్ని ప్రారంభించడానికి బాప్తీస్మం అనునది ఒక సరిక్రొత్త మార్గమైయున్నది.

మనము యేసు తిరిగి రావలెనని నిజముగా ఆశిస్తున్నట్లైతే, అప్పుడు మనము ఆయన కుడిపార్శ్వములో తప్పక వుండవలసివుంది. అపోస్తలుడైన పౌలు తన జీవిత చరమాంక దశలో వ్రాసినటువంటి వాక్యములతో ముగిద్దాం.

"మంచిపోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని, ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" (2వ తిమోతి 4:7-8)

పై వచనాలు మనందరి విషయములో కూడా నిజమగును గాక.

## ప్రశ్నలు:

**Questions:**

1. దేవుని రాజ్యమునకు మరియు పరలోక రాజ్యమునకు ఏమైనా తేడావున్నదా?
2. దేవుడు ఇంతకుముందెన్నడూ ఈ భూమి మీద రాజ్యము కలిగిలేడా?
3. పరలోకమునకు ఎవరు వెళ్తారు?
4. యేసు యొక్క రెండవ రాకడ ఎప్పుడు?
5. తీర్పు అనగా ఏమి?
6. రాజ్య కాలంలో ఉండు ఐదు ప్రయోజనాలు తెలుపుము?
7. ప్రధాన నగరము ఎక్కడ వుండును?
8. రాజ్యంలో ఎవరైనా పని చేస్తూవుంటారా?
9. ఆ రాజ్యము ఎంతవరకు వుండును?
10. ఆ రాజ్యములోనికి మనము ఏ రీతిగా ప్రవేశించగలము?